## క్లుప్తంగా

### విద్యుత్ సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి


వెంకటేశ్వరరావు

హిరమండలం: విద్యుత్ బిల్లులను విద్యుత్ సంస్థ యాప్ ద్వారా చెల్లింపులు చేయాలని హిరమండలం విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇకపై వినియోగదారులు యూపీఐల ద్వారా కాకుండా ఏపీఈపీడీసీఎల్ సంస్థ రూపొందించిన యాప్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలన్నారు. ప్లేస్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునన్నారు. పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే వంటి యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించడం కుదరదన్నారు.

### ఎరువుల పంపిణీ


ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ లతశ్రీ

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు పంపిణీ చేయటం జరుగుతుందని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ఎరువులు పంపిణీ చేశారు. ఎరువులకు కొరత లేకుండా ముందస్తుగానే ఎరువులు తెప్పించి ఇస్తున్నామన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నగదు చెల్లించిన రైతులకు ఎరువులు సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ఆర్‌ఐ గవరయ్య, సర్పంచ్ రావాడ రాజేశ్వరి, గుండపు రాము, తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ర్యాంప్ పరిశీలన


ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న సెబ్ ఎస్ఐ, వీఆర్వో

కొత్తూరు: ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక సెబ్ ఎస్ఐ శ్రావణి తెలిపారు. మండలంలోని పొనుటూరు వద్ద వంశధార నదిలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంప్‌ను శనివారం పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశామన్నారు. ఇసుక ర్యాంప్‌ల వద్ద ట్రెంచ్‌లు తవ్వించినట్లు వీఆర్వో రాజగోపాలరావు తెలిపారు.

### మహిళా సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండాలి


మాట్లాడుతున్న డీపీఎం మోహన్‌రావు

హిరమండలం: గ్రామాల్లో మహిళా స్వయంశక్తి సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని వెలుగు ఐబీ డీపీఎం కె.మోహన్‌రావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల సమైఖ్య ఈసీ సమావేశం నిర్వహించారు. మహిళలు జీవనోపాధులు పెంపొందించుకునేందుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలన్నారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్ వంటి రుణాలు రికవరీ శత శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. నాలుగేళ్లకు సంబంధించిన ఆడిట్ పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఎల్ఎం పరిధిలోని లోకాస్ యాప్‌లో పెండింగ్ వివరాలు పొందుపర్చాలని తెలిపారు. మహజన సభ ఏర్పాటు చేసేందు పలు సూచనలు చేశారు. ఏసీ మనోరత్నం, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, ఏపీఎంలు సుశీల, వి.శ్రీరామచంద్రమూర్తి, సీసీలు పాల్గొన్నారు.

### పరామర్శ..


తర్లాడ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి: మూలసవళాపురం సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు మనుమడు సిద్ధార్థ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించి వారిలో పార్టీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, తర్లాడ సురేంద్ర, గురువు తిరుమలరావు తదితరులు ఉన్నారు.

### ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

పాతపట్నం: మండల కేంద్రంలోని అంతరాబ కూడలి వద్ద ఉన్న సిరిపురం క్యాంప్ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరా నివాళులర్పించారు. పెద్దలొగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

# రథయాత్రకు సర్వం సిద్ధం


ఎల్.ఎన్.పేట: జగన్నాథస్వామి ప్రధాన ఆలయం

- నేడు జగన్నాథ రథయాత్ర ప్రారంభం
- వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వనున్న స్వామివారు

సారవకోట: మండలంలోని అవలింగిలో గల జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి రథ యాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. తొలిరోజు స్వామి వారిని రథంపై గుండిచా మందిరానికి తరలిస్తామన్నారు. 9 రోజుల పాటు వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**హిరమండలంలో..**

హిరమండలం: జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు శ్రీనివాసపాడి, సురేష్ పాడి శనివారం తెలిపారు. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. జగన్నాథుడు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

**నరసన్నపేటలో..**

నరసన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నుంచి రథయాత్ర ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆలయాలను ముస్తాబు చేశారు. జగన్నాథ స్వామి విగ్రహాలను సిద్ధం చేశారు. నరసన్నపేటలోని పెద్దపేటలో గల రామాలయంలో ఈ నెల 7 నుంచి 18 తేదీ వరకు యాత్ర నిర్వహిస్తామని అర్చకులు వసనాబి గాంధీ తెలిపారు. సత్యవరం నుంచి ఆదివారం సాయంత్రం జగన్నాథ స్వామి ఊరేగింపుగా పెద్దపేట చేరుకుంటారని తెలిపారు. 18న మారు రథయాత్రలో తిరిగి ఊరేగింపు ఉంటుందన్నారు. నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయం, లకిమేరలోని ఉమారామలింగేశ్వరాలయంలో రథయాత్ర ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు.

**పాతపట్నంలో..**

పాతపట్నం: పాతపట్నంలో జగన్నాథుని రథ యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయల ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ పండా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జగన్నాథుడి రథ యాత్రగా ఉత్తర దిశగా మార్కెట్, పంచాయతీ కార్యాలయం బస్టాండ్, మెయిన్ వీధి మీదుగా బ్రాహ్మణ వీధిలో ఉన్న గుండిచా మందిరానికి వెళ్తారన్నారు. దశావతారాలు ప్రదర్శించి గుండిచా మందిరంలోనే భక్తులతో పది రోజులపాటు పూజలు అందుకుంటారన్నారు. తిరుగు రథయాత్రతో జగన్నాథుడు ప్రధాన ఆలయానికి చేరుకుంటారన్నారు. రథ యాత్రకు పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారన్నారు.

**లక్ష్మీనర్సుపేటలో..**

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో జగన్నాథ స్వామి రథ యాత్రకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం జరగనున్న రథ యాత్ర కోసం రథాన్ని కూడా సిద్ధం చేసినట్లు కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు తెలిపారు. జగన్నాథ స్వామి నేత్రోత్సవ పూజలు తరువాత తెరచాటున ఉన్న జగన్నాథ స్వామి రథ యాత్ర సందర్భంగా భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ అర్చకులు వినోద్ కుమార్ పత్రి తెలిపారు. బలబద్ర, సుభద్ర సమేతంగా జగన్నాథ స్వామి గుండిచా మందిరానికి వెళ్లి దశ అవతారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. గుండిచా మందిరం నిర్మాణ దశలో ఉన్నందున ప్రధాన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుండిచా మందిరంలోనే జగన్నాథ స్వామి పూజలు అందుకుంటారన్నారు. సుమారు ఐదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరుకున్న రథం స్థానంలో దాతల సహకారంతో కొత్త రథం నిర్మాణం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రథ యాత్రకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**ఆమదాలవలసలో..**

ఆమదాలవలస: జగన్నాథ రథయాత్ర సందర్భంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలతో కూడిన సైకత శిల్పాన్ని మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర స్వామి కొండ దిగువ సైకత శిల్పి గేదెల హరికృష్ణ శనివారం వేసిన సైకత శిల్పాలు ఆకట్టుకున్నాయి. ఒడిశా ప్రజల సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సాగే రథయాత్రలో ప్రపంచంలోనే అత్యధిక మంది భక్తులు పాల్గొంటారని, వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పాన్ని ఆవిష్కరించినట్లు హరికృష్ణ తెలిపారు.


సారవకోట: ప్రత్యేక అలంకరణలో జగన్నాథ స్వామి


నరసన్నపేట: సత్యవరంలో సిద్ధం చేసిన జగన్నాథ స్వామి ఉత్సవ విగ్రహాలు



ఆమదాలవలస: జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల సైకత శిల్పం


పాతపట్నం: రథయాత్రకు సిద్ధంగా ఉన్న రథం


హిరమండలం: జగన్నాథస్వామి ఆలయం

## 750 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే విక్రయించాలి


అంగూరు వద్ద ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

కొత్తూరు: రోజుకు 750 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే విక్రయించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల కమర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వంశధార నదిలో అంగూరు వద్ద నిల్వ చేసిన ఇసుక నిల్వలను సబ్ కలెక్టర్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా అంగూరు వద్ద నిల్వ ఉన్న ఇసుకను విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే విక్రయాలు మొదలుపెడతామన్నారు. నాలుగు ట్రాక్టర్లకు ఇసుక విక్రయించిన అనంతరం ఆరు టైర్లు ఉన్న లారీ(టిప్పర్) ఒక దానికి మాత్రమే విక్రయించడం జరుగుతుందని స్థానిక తహసీల్దార్ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. ఒక మెట్రిక్ టన్ను ధర రూ.340గా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి దినం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల్లోపు విక్రయాలు ఉంటాయన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీకి చెందిన ఉద్యోగులతో బృందాలుగా ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తామన్నారు.

# భూసార పరీక్షలతో మేలు


సారవకోట: ఎస్‌హెచ్‌సీలు పంపిణీ చేస్తున్న ఏఓ వెంకటరావు


హిరమండలం: భూసార పరీక్షల కార్డులు పంపిణీ చేస్తున్న ఏఓ సంధ్య

సారవకోట: భూసార పరీక్షలతో రైతులకు మేలు కలుగుతుందని వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు అన్నారు. మండలంలోని బొంతు రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు (ఎస్‌హెచ్‌సీ) శనివారం పంపిణీ చేశారు. 2023లో నిర్వహించిన భూసార పరీక్షలకు సంబంధించిన ఫలితాల ధ్రువీకరణ పత్రాలు రైతులకు అందజేస్తున్నామన్నారు. ఈ ఫలితాల ఆధారంగా రైతులు ఏ పంట పండించవచ్చు, ఏరకమైన ఎరువులు వినియోగించాలని తదితర వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బాద్ర లక్ష్మీనారాయణ, సురవరపు తిరుపతిరావు, వీహెచ్‌ఏ పోలాకి శివ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌హెచ్‌సీ కార్డుల పంపిణీ**

హిరమండలం: భూసార పరీక్షలకు అనుగుణంగా సూచించిన ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయని ఏఓ బి.సంధ్య అన్నారు. హిరమండలం రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షల ఫలితాలకు సంబంధించిన (ఎస్‌హెచ్‌సీ) సోయల్ హెల్త్ కార్డులను శనివారం రైతులకు పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఇటీవల సేకరించిన మట్టి నమోనాలు ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాలకు సంబంధించిన కార్డులు రైతులకు అందజేయడం జరిగిందన్నారు. కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామ సభ నిర్వహించారు.

### ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఆమదాలవలస: రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎఫ్‌పీఓ, సీసీ రామప్పడు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల సమాఖ్య లీడర్లు, సంబంధిత సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

### విత్తన శుద్ధిపై అవగాహన

సరుబుజ్జిలి: డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు మరింత ఆర్థికంగా వృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సంఘాల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా నిర్దేశించిన కాలమానం ప్రకారం సమైఖ్యసంఘాల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పుస్తక నిర్వహణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయం సాగు చేసే దిశగా పనిచేయాలన్నా. విత్తన శుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. డీపీఎం నారాయణరావు, డీపీఎంఐబీ మోహనరావు, ఎల్‌సీ రామచంద్రరావు, స్త్రీనిధి మేనేజర్ లక్ష్మణరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బొడ్డేపలి చామంతి, వెలుగు ఏపీఎం కమలకుమారిపాండ్యన్, సీసీ రోజాలత, అకౌంటెంట్ కల్యాణి పాల్గొన్నారు.

### వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం..

హిరమండలం: ఈ నెల 8వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిరమండలంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజవుతారన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం డాక్టర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వి.అర్చన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మిగులు సీట్లకు పాఠశాలకు దరఖాస్తులు వచ్చినవి లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఇంటర్మీడియెట్ కోసం చేసిన దరఖాస్తులను పదో తరగతి మార్కులతో పాటు గురుకులంలో ప్రవేశ పరీక్ష రాసిన వారికి ప్రధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 8096613777 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

పొందూరు: గ్రామీణ ఉపాధి పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులు తమ పంట భూముల్లో పండ్ల తోటలను పెంచుకునేందుకు అవసరమైన మొక్కలను అందజేస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. రైతులకు కావాల్సిన కొబ్బరి, మామిడి, జీడిమామిడి, జామ, మునగ వంటి మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడేళ్లపాటు మొక్కలు పెంపకానికి నగదును రైతులు ఖాతాలకు జమ చేస్తామన్నారు. క్లస్టర్ పరిధిలో పొందూరు, ఆమదాలవలస, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో ఇప్పటివరకు 295 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. క్లస్టర్ పరిధిలో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. ఏపీఓ పి.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### 45 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని పీఎల్‌దేవిపేటలో బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో 45 మంది రోగులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. స్టాప్ డైయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేబిస్ ప్రాణాంతకం


పాతపట్నం: టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ ఆనందరావు

పాతపట్నం: జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న పశుసంవర్ధకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు వ్యాక్సిన్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. సహాయ సంచాలకులు ఎం.కరుణాకరరావు మాట్లాడుతూ కుక్క కరవడం ద్వారా రేబిస్ వ్యాధి వస్తుందన్నారు. కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయడం తప్పనిసరి అన్నారు. పశువైద్యులు పి.అనిల్ కుమార్, బి.శ్రీవాణి, కె.మౌనిక, నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రాబిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస పశుసంవర్ధక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలో ఏడీ కార్యాలయం వద్ద పలువురు పశుపెంపకందారులకు, కుక్కలు పెంచే యజమానులకు శనివారం అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్‌ను వేశారు. రాబిస్ వ్యాధి ప్రాణాంతకమని గుర్తు చేశారు. గర్భిణులు, చిన్నారులు పెంపుడు కుక్కల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వివరించారు. కుక్కల నుంచి మనుషులకు ప్రబలే పలు వ్యాధులను వివరించారు. కార్యాలయం సిబ్బంది, శిక్షణ పొందుతున్న విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# అభిమానులకు అందుబాటులో..


కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న శిష్టకరణ సంఘ నాయకులు

పోలాకి: మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మబగాంలోని ఆయన నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉండనున్నట్లు తెలిసింది. పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని ఆయన తొలుత నిర్ణయించినప్పటికీ అభిమానులు, ముఖ్య నాయకుల ఒత్తిడి మేరకు నిరాడంబరంగానే వేడుకలు నిర్వహించనున్నట్లు మాజీ డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు శనివారం తెలిపారు. పోలాకి మండల కేంద్రం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ర్యాలీగా వెళ్లనున్నట్లు మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు పేర్కొన్నారు. శిష్టకరణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో సంఘ నాయకులు శనివారం కృష్ణదాస్‌ను కలిసి ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్షిప్తంగా..

**శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించండి**

ఆమదాలవలస: జన విజ్ఞాన వేదికలో చేరి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. మానవుడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధిస్తూ అంతరిక్షంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. కొంతమంది మూఢనమ్మకాలతో తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారన్నారు. హెచ్ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, జేవీవీ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు**

సారవకోట: స్థానిక హెచ్‌పీ కమ్యూనిటీ హాల్‌లో బాబూ జగ్జీవనరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల దళిత సంఘం ఆధ్వర్యంలో శనివారం నివాళుల్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దళిత సంఘం మండల అధ్యక్షుడు సింహాచలం, ట్రెజరర్ చిరంజీవి, మాజీ ఎంపీటీసీ వాన కామేశ్ పాల్గొన్నారు.

**కొత్తూరులో..**

కొత్తూరు: మండలంలోని మహార్తాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బాబూ జగజ్జీవన్‌రామ్ హెల్పింగ్ ఫ్యామిలీ దళిత సంఘం ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, సంఘం అధ్యక్షుడు అల్లాడ రమేష్, ఉపాధ్యక్షుడు టెక్కలి రవిశంకర్, ట్రెజరర్ కోల రమేష్, మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేగేటి కన్నయ్య స్వామి, జంక వెంకటరావు, కొయిలాపు సంజీవరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**గిరిజనుల భూములను రక్షించండి**

జలుమూరు: మండలంలోని మర్రివల పంచాయతీ పరిధి ఎస్టీ మాకివలసలో సుమారు 90 ఏళ్లుగా 60 గిరిజన కుటుంబాలు సాగు చేస్తున్న 70 ఎకరాల వ్యవసాయ భూములను రక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు కోరారు. తహసీల్దార్ నాగమ్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. సాగు చేస్తున్న వ్యవసాయ భూములను కొంత మంది భూస్వాములు నాశనం చేస్తున్నారని, ఇక్కడ నుంచి గిరిజనులను తరిమేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారని ఆరోపించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రతినిధులు పాల్గొన్నారు.

**మొక్కలతో పర్యావరణ పరిరక్షణ**


కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న సివిల్ జడ్జి

నరసన్నపేట: పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. కోర్టు ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. తొలిత నరసన్నపేట కోర్టులో సుదీర్ఘ కాలం న్యాయవాదిగా సేవలు అందించిన అనంతరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జామి కామేశ్వరరావు, న్యాయవాదులు జి.గణేష్, ఆర్.కృష్ణంనాయుడు, టి.మధు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తం**

ఎల్.ఎన్.పేట: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. కుళాయిలు, బోర్లు, బావులు వద్ద పరిశుభ్రంగా ఉంచటంతోపాటు బ్లీచింగ్ వేయించాలన్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ప్రియాంక, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

**గుణాత్మక విద్య అవసరం**

జలుమూరు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని ఎంఈఓ ఎం.వి.ఆర్ ప్రసాద్ అన్నారు. జలుమూరు ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. ఉపాధ్యాయుడు మెండ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.